
వానాకాలం పంటల ప్రణాళిక ఖరారు

- జిల్లాలో 4.24 లక్షల ఎకరాల్లో సాగు కానున్న వివిధ పంటలు
- అత్యధికంగా 3.05 లక్షల ఎకరాల్లో వరి వేస్తారని అంచనా
- విత్తనాలు, ఎరువులు, కాంప్లెక్స్ ప్లానింగ్ సిద్ధం

జగిత్యాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానా కాలం పంట ప్లానింగ్ ఖరారు అయింది. రానున్న ఖరీఫ్‌లో రైతుల ఇబ్బందులు తొలగించడానికి వ్యవ సాయశాఖ ముందస్తుగా సాగు ప్రణాళిక రూపొందించింది. వ్యవసాయ క్లస్టర్ల వారీగా ఎన్ని ఎకరాల్లో భూమి సాగవుతుందని అంచనా వేసి ఈ మేరకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచ నున్నారు. జిల్లాలో సాధారణ సాగు, గత యేడాది వానాకాలం సాగు కంటే ప్రస్తుతం రానున్న వానాకా లం సీజన్‌లో అధికంగా వివిధ పంటలు సాగు అవు తాయని అధికారులు అంచనాలు రూ పొందించారు.

అందుబాటులో విత్తనాలు...

జూన్ 1 నుంచి వానా కాలం సీజన్ మొదలు కాగానే అన్నదాతలకు అవస రమైన ఎరువులు, విత్త నాలు అందించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. వరికి సంబంధించి వివిధ రకాల విత్తనాలు 76,250 క్విం టాళ్లు అవసరమని అంచనా వేశారు. మొక్కజొన్న 3,280 క్వింటాళ్లు, కందులు 75, పెసర్లు 12, సోయాబీన్ 180 క్వింటాళ్లు, పత్తి 40,200 ప్యాకెట్లు అవస రమవుతాయని అధికారులు అంచనా వేశారు.



ఎరువు ప్రణాళిక ఇలా...

జిల్లాలో ప్రతిపాదించిన పంట ల విస్తీర్ణం ఆధారంగా ఎరు వుల ప్రణాళికలు తయారు చేశారు. జిల్లాకు అవసరమైన ఎరువుల సర ఫరా కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన ల ను అధికారులు సమర్పించారు. రానున్న వానాకాలం సీజన్‌లో జిల్లాలో మొత్తం కాం ప్లెక్స్ 46,100 మెట్రిక్ టన్నులు అవసరమవుతా యన్న అంచనా ఉంది. యూరియా 36,650, డీఏపీ 11,747, ఎంఓపీ 10,300, ఎస్ఎస్‌పీ 4,780 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇందులో జూన్ మాసంలో కాంప్లెక్స్ 9,200, జూలై లో 13,850 ఆగస్టు 13,850, సెప్టెంబరులో 9,200 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేసి ప్రభు త్వానికి ప్రతిపాదనలు పంపారు.

నకిలీ విత్తన వ్యాప్తి అరికట్టడానికి కార్యాచరణ ప్రణాళిక...

జిల్లాలో 450 విత్తన విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా విత్తనాన్ని రైతులకు అందుబాటులో ఉంచనున్నారు. నకిలీ పత్తి, ఇతర విత్తన విక్రయాలను అరి కట్టేందుకు టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో భాగంగా పోలీ సులు, వ్యవసాయ శాఖ అధి కారులతో కలిసి బృందాలను ఏర్పాటు చేశారు. మే 3వ వారం నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని విత్తన విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నా రు. రైతులకు నాణ్యమైన విత్తనం, ఎరు వుల, పరుగు మందులు అందించడానికి అధికారులు ఇచ్చిన లక్ష్యం ప్రకారం ప్రతీ ఎరువు, విత్తన దుకా ణాలను తనిఖీ చేసి నమూనాలను సేకరించి పరీక్షా కేంద్రానికి పంపడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా వానాకాలంలో పంటల సాగు అవుతుం దన్న అంచనాను అధి కారులు వేశారు. జిల్లాలో పంటలు సాదారణ సాగు విస్తీర్ణం 3,35, 978 ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 4,24,425 ఎకరా లు సాగు చేస్తారని అంచనా వేశారు. ఇది సాధార ణం కన్నా 88,447 ఎకరాలు అధికంగా ఉంది. మండలాల్లోని క్లస్టర్ల వారీగా సాగు విస్తీర్ణం అంచనాలను వ్యవసాయ అధికారులు రూపొం దించారు. ఇందులో ప్రధానంగా వరి 3,05,000 ఎకరాలు, మొక్కజొన్న 41,000 ఎకరాలు, కందులు 2,500, పెసర్లు 150, ఇతర పప్పులు 675, సోయా చిక్కుడు 600, పత్తి 20,200, చెరుకు 1,200 ఎకరాలు, పసుపు 11,000, ఇతర పంటలు 42,100 ఎకరాల్లో సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. రైతు వేదికల ద్వారా సంబంధిత పంటలపై సిఫార్సు చేసిన సా గు విధానంపై కరపత్రాలు, పోస్టర్లు, బుక్ లెట్‌లను అందించడం వంటివి చేయడానికి అధికారులు నిర్ణ యించారు. 2025లో ఆయిల్ ఫాం పంట సాగును విస్తరించాలని నిర్ణయిం చారు. గత చివరి వానాకాలం సీజన్‌లో జిల్లాలో 4,17,378 ఎకరా ల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో గత యేడాది కంటే అధికంగా సాగు చేయనున్నట్లు అధికా రులు అంచనా వేశారు.

సాధారణ విస్తీర్ణంకంటే ఎక్కువగా సాగు...

అంచనాలు రూపొందించాము

వాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



జిల్లాలో వానాకాలం పంట సాగు అంచనాలను రూపొం దించాము. అందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేందుకు కసరత్తులు చేస్తున్నాము. జిల్లాలో ప్రధానంగా వరి, మొక్క జొన్న, ఇతర పంటలను సాగు చేస్తారు. ఇందుకు తెలంగాణ విత్తనాభి వృద్ధి సంస్థ ద్వారా సిద్ధం చేస్తున్నాము. రైతులకు పంట సాగుపై అవగాహన కల్పించడానికి నిర్ణయించాము.

హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలు షురూ..

- కొండగట్టుకు తరలి వస్తున్న దీక్షాపరులు..
- నేడు చిన్న హనుమాన్ జయంతి



కొండగట్టులో హనుమాన్ భక్తులు

7లో..

చేతులపై మెహందీతో ఓటరు అవగాహన



చేతులపై మెహందీతో ప్రదర్శనలు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 22 :మెప్మా రిసోర్స్ పర్సన్ల ఆధ్వర్యంలో చేతులపై మెహంది పెట్టుకుని ఓటరు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టి ఆకట్టుకున్నా రు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటరు అవగాహన సదస్సులో భాగంగా సోమ వారం జగిత్యాల మున్సిపల్ సమావేశ మందిరంలో మెప్మా రిసోర్స్ పర్సన్ల ఆ ధ్వర్యంలో మెహందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ లు తమ చేతులపై మెహందీతో మై ఓట్..మై ఫ్యూచర్ అంటూ పలు రకాలు గా నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కమిషనర్ అనీల్ బాబు, మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్, డీఎంసీ సునిత, టీఎంసీలు రజిత, శివ, జలందర్, రాము, సీవోలు సంధ్య, రాధ, జ్యోతి, పల్లవి, శరణ్య ఉన్నారు.

విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు టెలీ మానస్ సేవలు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 22 : పరీక్ష ఫలితాల సందర్భంగా విద్యార్థుల్లో మా నసిక ఒత్తిడిని తగ్గించేలా ప్రభుత్వం టెలి మానస్ సేవలను అందుబాటు లో కి తీసుకవచ్చిందని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఘటనల దృష్ట్యా, పరీక్షల ఫలితాల సమయంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని ఎ దురుకుంటున్నారని, విషాదకరంగా కొందరు ఆత్మహత్య చర్యలకు పూనుకో వడంలాంటి చర్యలను పరిష్కరించేందుకే టెలి మానస్ సేవలు ప్రారంభించి నట్లు వివరించారు. పరీక్షల్లో ఫేయిల్ కావడం తప్పుకాదని ఆత్మహత్యలకు సంబంధించిన ఆలోచనలు చేయడం పెద్దతప్పన్నారు. తీవ్రమైన ఆందోళనకు గురయ్యే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ జన రల్ ఆసుపత్రిలో ఉన్న మానసిక వైద్యులను సంప్రదించి సేవలు పొందవ చ్చునన్నారు. టెలీ మానస్ హెల్ప్ లైన్ నెంబరు 14416 లేదా 18008914416 సంప్రదించవచ్చునన్నారు.

ఘనంగా విద్యార్థుల వీడ్కోలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

ధర్మపురి, ఏప్రిల్ 22: ధర్మపురి మండలంలోని ఆరెపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సోమవారం ఘనంగా జరిగింది. పాఠశాల విద్యార్థులు నృత్యాలతో, గీతాలతో తమ భావాలను వ్యక్తపరుచుకున్నారు. అనంతరం పాఠశాల హెచ్ ఎం బెజ్జంకి నితిన్‌కుమార్ మాట్లాడుతూ పి ల్లలకు మంచి పునాది ఇవ్వడంలో శక్తి వం చన లేకుండా కృషి చేసినట్లు తెలిపారు. భ విష్యత్తులో పిల్లలు మంచి స్థాయికి ఎదిగి పాఠ శాలలకు మంచి పేరు తీసుక రావా లని కోరారు. ఉపాధ్యాయులు మ్యాన పవన్ కుమార్, గుగ్గిల్ల సరోజ, చామంతి, అంగన్ వాడీ వర్కర్ శాంతి, లక్ష్మీకాంత పాల్గొన్నారు.

సంజయ్ కుమార్‌కు పరామర్శ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 22 : జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను ఉమ్మడి కరీం నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ సోమవారం పరామర్శించారు. సంజయ్‌కు మార్ తండ్రి సీనియర్ న్యాయవాది హన్మం తరావు ఇటీవల మృతి చెందాడు. ఎమ్మెల్సీ రమణ తన సానుభూతిని తెలియజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు నిరంజన్, రాము ఉన్నారు.

నిజామాబాద్‌లో 12 నామినేషన్ల దాఖలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్ని కల నామినేషన్‌ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి సోమవారం 12 నామి నేషన్‌లు దాఖలయ్యాయి. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన సయ్యద్ అస్గర్ సోమవారం రెండవ సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు. బీఆర్‌ఎస్ అభ్య ర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మూడవ సెట్ నామినేషన్ పత్రాన్ని అందజేశారు. బహుజన్ ముక్తిపార్టీ అభ్యర్థిగా దేవతి శ్రీని వాస్ మూడవ సెట్, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అ ర్వింద్ ధర్మపురి తరపున రెండవ సెట్ నామినేషన్ పత్రా లు దాఖలు చేశారు. వీరితో పాటు అలయన్స్ ఆఫ్ డెమో క్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా యుగందర్ గట్ల, మన తె లంగాణ రాష్ట్ర సమైక్యతా పార్టీ అభ్యర్థిగా పోతు అశోక్‌లు నామినేషన్‌లు వేశారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా కం డెల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా ఆర్.రాజేందర్, రాపెల్లి శ్రీనివాస్‌లు రెండవ సెట్ నామినేషన్లు వేశారు. నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విఠల్ మాలావత్, స్వతంత్ర అభ్యర్థిగా కాత్రాజి ప్రశాంత్, యుగ తులసి పార్టీ అభ్య ర్థిగా కోటగిరి శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు మొత్తం 28 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు తెలి పారు. ఈనెల 25తో నామినేషన్ల గడువు ముగియనుంది.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

రాయికల్, ఏప్రిల్ 22: 30 ఏళ్లుగా భాషా పండితులు సమాన పనికి సమాన వేతనం, సమాన గౌరవం లభించ క వెట్టిచాకిరి చేస్తూ శ్రమదోపిడీకి గుర వుతున్నారని, భాషా పండితులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని ఆర్ యూపీపీటీ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి వేల్పుల స్వామి యాదవ్ అన్నారు. మండలంలోని అల్లీపూర్ పా ఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు కర్ర శ్రీమతి పదవీ విరమణ సభ సోమవారం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన స్వామి యాదవ్ మాట్లాడుతూ వారు ఉద్యోగ జీవితంలో చేసిన సేవలను, సామాజిక చై తన్యాన్ని, దేశభక్తిని కొనియాడారు. దేశం గర్వించే ఎందరో దేశభక్తులను తయారు చేశారని, జాతీయవాదులని ర్మా ణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రె స్‌క్లబ్ జేఏసీ అధ్యక్షులు వాసరి రవి యాదవ్, మనోహర చారి, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్ గౌడ్, ఎంఈవో ములస్తం గంగాధర్, సీనియర్ గెజిటెడ్ ప్రధానో పాధ్యాయులు రాఘవులు, నరేందర్ పాల్గొన్నారు.

బీడీ టేకేదారుల సమస్యల పరిష్కరించాలి

కోరుట్ల, ఏప్రిల్ 21 : బీడి టేకేదారుల సమస్యల పరి ష్కారానికి యజమాన్యం కృషి చేయాలని బీడి కార్మిక సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుతారి రాములు డిమాం డ్ చేశారు. సోమవారం పట్టణంలోని టేకేదారుల సమా వేశంలో రాములు పాల్గొన్ని మాట్లాడారు. టేకే దారులకు కమీషన్ పెంచి వారి సమస్యం పరిష్కారంపై యాజమా న్యం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ డిజి ల్ ధరల పెరిగినప్పటికీ ఎగుమతి దిగుమతి ట్రాన్స్ పో ర్టు ఖర్చులు పెరగడంతో బీడి టేకేదారులు ఇబ్బందు ల ను ఎదుర్కొంటున్నారన్నారు. వేయి బీడిలకు రూ. 18 క మీషన్ నుంచి రూ. 30 పెంచాలన్నారు. టేకేదారులకు జీ వన భృతి అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దే శాయి, శివాజీ, చార్ బాయి బీడి ఎజెంట్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 22 : నిజామాబాద్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన జీవన్ రెడ్డిని ఆశీర్వ దించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జగిత్యాల ము న్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన అనుముల పద్మావతి. సంకోజు వెంకట రమణ, 46వ వార్డుకు చెందిన 50 మంది మహిళలు సో మవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సి పల్ చైర్ పర్సన్ విజయ లక్ష్మి, నాయకురాళ్లు పిప్పరి అనిత, బింగి సుమ, లత, అడువాల లక్ష్మణ్ ఉన్నారు.

ప్రజలను పట్టించుకోని బండి

- ఐదేళ్లల్లో అభివృద్ధికి దూరంగా కరీంనగర్
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బి.వినోద్‌కుమార్



మల్యాలలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్, గంగుల కమలాకర్

మల్యాల, ఏప్రిల్ 22: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్లలో ఏనాడు ప్రజలను పట్టించుకోలేదని, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కూడా ఏమీ లేద ని కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బి.వినోద్‌కుమార్ విమర్శించారు. హిం దూత్వం అని చెప్పుకునే ఆయన ఆలయాల అభివృద్ధి కోసం కనీసం అయి దు రూపాయలు కూడా తీసుకురాలేదని అటువంటి వాళ్ల ఓట్ల కోసం వస్తే ని లదీయాలని మల్యాలలో సోమవారం రాత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమ లాకర్‌తో కలిసి నిర్వహించిన రోడ్‌షోలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ పదవిని బండి సంజయ్ కోసం తీసుకువచ్చినట్లు ఉందని ఎమ్మెల్యే ఓడితే ఎంపీగా పోటీ చేపిస్తూ కరీంనగర్ ఎంపీ పదవిని పునరావాసం గా మార్చారని విమర్శించారు. తాను ఎంపీగా గతంలో అనేక అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టానని ఈ సారి ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్‌కు స్కిల్ డెవలప్ మెం ట్ సెంటర్ తీసుకువస్తానని వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ గారడి మాటలు, మోసపూరిత హామీలపై నా లుగు నెలల్లోనే ప్రజలకు విరక్తి వచ్చిందని అన్నారు. తెలంగాన ప్రాంత హక్కుల గురించి ప్రశ్నించే గొంతుక వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఎంపీగా వినోద్, ఎమ్మెల్యేగా తాను డబుల్ ఇంజన్‌లా పని చేస్తూ అధిక నిధులు తీసుకువస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్లు సాగర్‌రావు, మధుసూధన్‌రావు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠాపన

రాయికల్, ఏప్రిల్ 22: పట్టణంలోని అతి పురాతన దేవాలయమైన గడికో టలో సోమ వారం నుంచి లకుమాదేవి, దత్తాత్రేయ, జగ ద్గురు శంకరాచార్యల విగ్రహ ప్రతిష్ఠాపనో త్స వాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సం దర్భంగా వేద పండితులు మునుగోటి రమేష్ శర్మ ఆధ్వర్యంలో దేవాలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఉదయం 10 గంటల నుంచి గ్రా మ ప్రదక్షిణ, పుణ్యాహ వచనం, రక్షాబం ధనం, స్థాపనలు, అగ్ని ప్రతిష్ఠ, జలాధి వాసము నీరా జనము కార్యక్రమాలను ఘనంగా నిర్వహించా రు. గౌరవ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ మో ర హన్మాండ్లు, ఆలయ అధ్యక్షుడు తుమ్మల సదాశివ రెడ్డి, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిండికి ఇబ్బందిగా ఉంది..ఆదుకోండి

కలెక్టర్‌ను ఆశ్రయించిన వృద్ధ దంపతులు



వృద్ధ దంపతులు

జగిత్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి): మలి వయస్సులో ఉన్నాం...బుక్కెడు బువ్వకు ఇబ్బందిగా ఉంది... కన్న కూ తుర్లు పట్టించుకోవడం లేదు.. ప్రభు త్వమే ఆదుకోవాలని కోరుతూ జిల్లా లోని మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన కొట్టూరి వెంకటాద్రి, కమల వృద్ధ దంపతులు జిల్లా కేంద్రంలోని క లెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ షేక్ యాస్మి న్ భాషాను కలిసి గోడు వెల్లబోసు కు న్నారు. ఎనిమిది పదుల వయస్సు దా టిన తాము ఏ పనులు చేసుకోలేని పరిస్థితిలో ఉ న్నామని వివరించారు. ముగ్గురు కూతర్లున్నప్పటికీ వృద్ధాప్యంలో బాగోగులు చూసుకోవడం లేదని రోది స్తూ విన్నవించారు. బుక్కెడు బువ్వ పెట్టాలని ము గ్గురు కూతుర్లను ప్రాదేయపడు తు న్నప్పటికీ పట్టించుకోవడం లేదని వా పోయారు. వయోభారము వల్ల చేత కాకుండా ఉన్న తమను కూతుళ్లు ని ర్లక్ష్యం చేయడం వల్ల నానా అవస్థల పాలవుతున్నామని తెలిపారు.

జగిత్యాల, కరీంనగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న ముగ్గురు కూతుళ్లకు కౌ న్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రుల బాగో గు లు చూసుకునేలా చర్యలు తీసుకో వా లని కోరుతూ వినతిపత్రం సమ ర్పిం చారు. వృద్ధ దంపతుల ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా జగిత్యాల ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించినట్లుగా దంపతులు కమల, వెంక టాద్రి తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీ మాయ మాటలు నమ్మి మోసపోవద్దు

- బీఆర్‌ఎస్ అభివృద్ధిని చూసి ఓటు వేయండి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

బీర్‌పూర్, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మా య మాటలు నమ్మి మోసపోవద్దని, బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి చూసి బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అ న్నారు. మండలంలోని తుంగూర్ గ్రామంలో సోమవారం రాత్రి ఎన్నికల ప్ర చారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎ న్నికల్లో మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నా రు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా సంపూర్తిగా అమలు చేయలేరని వి మర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రజల పక్షాన ఉండి నిలదీసే గొంతుక కేవలం బీఆర్‌ఎస్ ఎంపీలు మాత్రమేనన్నారు. అందరు ఈ ఎన్నికలను ప్రతిష్ఠా త్మకంగా తీసుకొని బీఆర్‌ఎస్ అభ్యర్థినైనా తనకు మీ అమూల్యామైన ఓటు వేసీ అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయన వెంట జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ దావ వసంత, ఎమ్మె ల్సీ ఎల్.రమణ, మాజీ మంత్రి రాజేశంగౌడ్, మాజీ మార్క్‌ఫేడ్ చైర్మన్ లోక బా పురెడ్డి, కెడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నారపాక రమేష్, ఉపాధ్యక్షులు రామకిష్టు గంగాదర్, మండల యూ త్ అధ్యక్షులు గాజర్ల రామచంద్రం పాల్గొన్నారు.



తుంగూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆరెస్ అభ్యర్థి గోవర్ధన్

కేసీఆర్‌ను ప్రజలు తిరస్కరించలేదు..

సారంగాపూర్ : కేసీఆర్‌ను ప్రజలు తిరస్కరించలేదు కాంగ్రెస్ నాయకులు చెప్పిన దొంగ హామీలు నమ్మి ఓట్లు వేశారని నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని పెంబట్ల, రేచపల్లి గ్రా మాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కార్నర్ మీంటింగ్‌లో పాల్గొని ప్రసంగిం చారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి తాను కొత్త కావచ్చు కానీ రాజా కీయాలకు ప్రజా సేవకు కొత్త కాదని తెలిపారు. ఎంపీగా గెలిపిస్తే అన్ని ప్రాం తాలను సమానంగా అభివృద్ధి చేస్తానన్నారు. ఆరు గ్యారెం టీలు అమలు చేయ లేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ రాముని పేరు చెప్పి ఓట్లు అడిగే పరిస్థితిలో బీజేపీ ఉం దన్నారు. మచ్చలేని నాయకుడు బీసీ బిడ్డ బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపీ ఎన్నికల్లో ఆదరించి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ మూడు వేరు వేరు చోట్ల పోటీ చేసిన కొద్ది మందిలో బా జిరెడ్డి ఒకరని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించా లని కోరారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో చె రువులు జల కళతో సంతరించుకున్నాయని నేడు చెరు వుల్లో నీళ్ళులేక చేపలు మృత్యువాత పడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాజేశం గౌడ్, మాజీ మర్క్‌ఫెడ్ చైర్మన్ బాపురెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ డాక్టరు చంద్రశేఖర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, జడ్పీ టీసీ మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సురేందర్ పాల్గొన్నారు.

పాండిచ్చేరీలో రోడ్డు ప్రమాదం

● సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి ● ఎఖీన్‌పూర్‌లో విషాదం



మనీష్ (ఫైల్)

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 21: పాండిచ్చేరిలో రోడ్డు ప్రమాదంలో కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. గ్రామానికి చెందిన చాడ రామకృష్ణ -మంజుల దంపతుల కుమారుడు మనీష్ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కంపనీలో రెండు సంవత్సరాలుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మనీష్‌తో పాటు మరో ముగ్గురు ఉద్యోగులు చెన్నైతో పాటు పాండిచ్చేరి పట్టణాలకు కంపెనీ పనిలో వెళ్లినట్లు తెలిసింది. చెన్నై నుంచి పాండిచ్చేరికి కారులో మిగితా ఉద్యోగులతో కలిసి వెలుతుండగా రోడ్డు ప్రమాదం జరిగినట్లు మనీష్ బంధువులు తెలిపారు. ప్రమాదంలో మనీష్‌తో పాటు మరో ఉద్యోగి మృతి చెందంగా మిగితా ఇద్దరి గాయాలైనట్లు వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో దీంతో ఎఖీన్‌పూర్ గ్రామంలో విషాదం అలుముకుంది.

జమ్మికుంటలో 15లక్షల నగదు పట్టివేత



జమ్మికుంటలో నగదు చూపిస్తున్న ఏసీపీ

జమ్మికుంట, ఏప్రిల్ 22: జమ్మికుంట పట్టణంలోని గ్రేన్ మార్కెట్ రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.15లక్షల నగదు పట్టుబడినట్లు హుజూరాబాద్ ఏసిపి శ్రీనివాస్‌జీ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టుబడిన నగదు వివరాలను ఏసిపి వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన పొనగంటి సురేష్ అనే వ్యక్తి రూ.15లక్షలు నగదు తీసుకు వస్తుండగా పట్టుకున్నారు. పోలీస్‌లు నగదు స్వాధీనం చేసుకోని సీజ్ చేశారు. నగదుకు సంబంధించిన ఆధారాలు లేక పోవడం వల్లే సీజ్ చేసినట్లు ఏసిపి తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ వరంగంటి రవి, సిబ్బంది పాల్గొన్నారు. పోలీసుల తనిఖీలు....రూ. 3 లక్షల పట్టివేత

చందుర్తి : చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వేములవాడ పట్టణానికి చెందిన రేగుల రజనీకాంత్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.3 లక్షల రూపాయలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పట్టుకున్న 3 లక్షల రూపాయలను సీజ్ చేసి, ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

అదుపు తప్పి వాహనం బోల్తా

● ఇద్దరికీ తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపు వద్ద సోమవారం ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో మండల కేంద్రానికి చెందిన సమీర్, ఎల్లంరెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని సాయికుమార్‌కు చెందిన వాహనాన్ని మరమ్మతు చేయించడం కోసం సమీర్, ఎల్లంరెడ్డిలు కలిసి సిరిసిల్లకు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో వాహనం అదుపు తప్పి పల్టీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ధర్మారం, ఏప్రిల్ 22: మండలంలోని నందిమేడారం గ్రామంలో మేడారం సత్తయ్యకు చెందిన గుడిసె షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం దగ్ధమైంది. గుడిసెలో ఉన్న 10క్వింటాళ్ల బియ్యం, నిల్వ ఉన్న ధాన్యం, దుస్తులు దగ్ధమయ్యాయి. సంఘటన స్థలానికి పెద్దపల్లి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. నిరుపేద కుటుంబానికి చెందిన సత్తయ్యకు ఆర్థిక సహాయం అందజేయాలని స్థానికులు కోరారు. సంఘటన స్థలానికి ఎంఆర్ఐ వరలక్ష్మి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 22: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బోంగోని చంద్రశేఖర్ సోమవారం ఈతచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా నడుంకు కట్టుకున్న బెల్ట్ తెగడంతో చెట్టు పైనుంచి జారి కిందపడటంతో గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సబ్బితం గౌడ సంఘం సభ్యులు కోరారు.

తాటిచెట్టు పైనుంచి జారిపడి ఒకరు..

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాకు చెందిన వ్యక్తి ధరావత్ తిరుపతి ప్రమాదవశాత్తు సోమవారం తాటి చెట్టుపై నుంచి జారి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. చుట్టు పక్కల వారు గమనించి 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని తిరుపతి తాటి ముంజల కోసం తాటి చెట్టు పైకి ఎక్కాడు. ముంజులు కోస్తున్న క్రమంలో కాలు జారి కింద పడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల తాటి ముంజల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు పలువురు కింద పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. తిమ్మాపూర్‌లోని బీమరి దేవయ్య తాటి చెట్టుపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తాటి చెట్టు ఎక్కడంలో అనుభవం లేకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

వీర్నపల్లి, ఏప్రిల్ 22 అనారోగ్యంతో బాధపడుతన్న ఓ మహిళ గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలం మద్దిమల్లకు చెందిన పాట్ల సుజాత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కొండగట్టుకు తరలివస్తున్న హనుమాన్ భక్తులు



కొండగట్టుకు తరలివస్తున్న హనుమాన్ దీక్షాపరులు



ముడుపు కడుతున్న భక్తులు



కొండగట్టులో హనుమాన్ దీక్షాపరులు

● నేడు చిన్న హనుమాన్ జయంతి

మల్యాల, ఏప్రిల్ 22: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి దీక్షాపరులు కొండగట్టుకు తరలి వస్తూ స్వామి వారిని దర్శించుకుని మాలవిరమణ చేస్తున్నారు. వేకువజామున వేలాదిగా భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల కోసం భక్తులు, అంజన్న దీక్షాపరులు వాహనాలు, కాలి నడకన కొండగట్టుకు తరలివస్తున్నారు. కాగా మంగళవారం చిన్న జయంతి కోసం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. వేలాదిగా భక్తులు తరలి వస్తున్నారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జయంతి ఉత్సవాల ప్రత్యేక అధికారి, వేములవాడ ఈవో కృష్ణప్రసాద్, ఈవో చంద్రశేఖర్, మల్యాల సీఐ నీలం రవి నిరంతరం కొండపైన పర్యవేక్షిస్తున్నారు.



భక్తుల మాల విరమణ

అంజన్న దీక్షాపరులు హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి సన్నిధిలో మాల విరమణ చేస్తారు. మాల విరమణ కోసం కల్యాణకట్టలో మండపం ఏర్పాటు చేశారు. ఇందులోనే భక్తులు మాల విరమణ చేస్తున్నారు. కల్యాణకట్ట వద్ద ఓ భక్తుడు తలనీలాలు సమర్పిస్తున్న క్రమంలో క్షురకుడు, ఆలయ సెక్యురిటి సిబ్బంది మధ్య గొడవ జరిగింది. అధికారులు, సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

● ఉచిత బస్సు సౌకర్యం

కొండగట్టుకు వస్తున్న భక్తుల వాహనాలకు జెఎన్‌టీయూ మార్గంలోని బొజ్జ పోతన వద్ద పార్కింగ్ ఏర్పాటు చేయగా అక్కడి నుంచి ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తుండడంతో కొండంతా కాషాయమయంగా మారుతుంది. రామనామంతో అంజన్న సన్నిధి పులకిస్తోంది

ఆంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం హనుమాన్ చిన్న జయంతిని దేవస్థానం తరుపున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్తర భారత దేశంలో ప్రతియేటా చైత్ర పౌర్ణమి రోజున హనుమాన్ జయంతిని నిర్వహించనుండగా ఇక్కడ కూడా అదే రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి అభిషేకం, పట్టువస్త్రలంకరణ చేశారు.



మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు



కొండగట్టులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు : కలెక్టర్

మల్యాల, ఏప్రిల్ 22: కొండగట్టులో జరుగుతున్న చిన్నహనుమాన్ జయంతి వేడుకలకు భక్తులకు ఎలాంటి సమస్యలు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ యాస్మీన్ భాష తెలిపారు. కొండపైన జయంతి ఏర్పాట్లను సోమవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు తమ దీక్షను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. భక్తులకు సరిపడా టికెట్ కౌంటర్లు తదితరవి ఏర్పాటు చేయగా 114 సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారుకులకు భక్తుల కోసం తీసుకోవల్సిన సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. దేవస్థానం అధికారుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డిఎస్పీ రఘుచందర్, ఆలయ ఈవో చంద్రశేఖర్, ప్రత్యేక అధికారి కృష్ణప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ధర్మగుండంలో స్నానం చేస్తున్న భక్తులు

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 32మంది రైతులు 501క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.5,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కొండగట్టుకు పాదయాత్ర చేపట్టిన భక్తులు జాగ్రత్తలు పాటించాలి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 22: కొండగట్టుకు పాదయాత్ర చేపట్టిన భక్తులు జాగ్రత్తలు పాటించాలని జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ పేర్కొన్నారు. హన్‌మాన్ జయంతి ఉత్సవాలను పురష్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి కొండగట్టు ఆలయం వరకు కాలినడకన వెళ్లే భక్తులకు రేడియం స్టిక్కర్ల ద్వారా రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. సోమవారం జగిత్యాల మండలం తిప్పన్నపేట స్టేజీ వద్ద కాలినడకన కొండగట్టు వెళ్తున్న భక్తులకు రేడియం స్టిక్కర్లను అతికించారు.

కేసీఆర్ నియంత పాలనతోనే అధికారంలోకి కాంగ్రెస్

● పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కేటాయించని కాంగ్రెస్ ● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

హుజూరాబాద్, ఏప్రిల్ 22: కేసీఆర్ కుటుంబ నియంత పాలనతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందే తప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వల్ల కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్లలో కేసీఆర్ కుటుంబం అనేక అక్రమాలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా అదే సమయంలో బీసీలను రాజకీయంగా అణగదొక్కుతున్నాడన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలను ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్ అధిష్టానానికి కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదన్నారు. కాంగ్రెస్ దృష్టిలో దళితులంటే మాలలు అయినప్పుడు మాదిగల ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికంగా రెడ్డి సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలిచే సీట్లు అగ్రకులాలకు ఇస్తూ ఓడిపోయే సీట్లు బీసీలకు కేటాయించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి ముస్లింలకు ఇస్తే, రేవంత్‌రెడ్డి హయాంలో ఒక్క మంత్రి పదవి కూడా ముస్లింలకు ఇవ్వలేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ బీజేపీకి మద్దతు ఇస్తుందన్నారు. ముస్లింలు బీజేపీ పార్టీని వ్యతిరేకించవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు చేసేది ఏం లేదన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆర్ రామచంద్రం, ఎం శ్రీనివాస్, టి వసంత్, వెంకటస్వామి, బి అనిల్, ఆర్ సాగర్, డి రవీందర్, అంజయ్య, టి రాజు, బి సారయ్య, ఆర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పాత కక్షలతో కుటుంబంపై దాడి

● వాహనాలు ధ్వంసం
● ముగ్గురికి తీవ్ర గాయాలు

కోనరావుపేట, ఏప్రిల్ 22: పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఒక కుటుంబంపై రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు దాడి చేయగా ముగ్గురికి తీవ్ర గాయాల య్యాయి. వారి వాహనాలను ధ్వంసం చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెంది న కుతాడి బాబు కుటుంబానికి, లోకిని ఎల్లవ్వ, ప్రశాంత్ కుటుంబాలతో పాతకక్షలు ఉన్నాయి. 15 రోజుల క్రితం కుతాడి బాబు తమ ఇంట్లో చొరబడి రూ. 50 వేలు ఎత్తుకెళ్లాడని, ఎల్లవ్వ మెడలోని పుస్తెలతాడు దొంగతనానికి ప్రయత్నించాడని కోనరావుపేట పోలీసులకు ఎల్లవ్వ కుమారుడు సతీష్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమం లో ఆదివారం రాత్రి కుతాడి బాబు, అతని తండ్రి కనక య్య, భార్య శిరీష కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో భోజనం చేస్తుండగా లోకిని సతీష్, లోకిని ప్రశాంత్, లోకిని దేవయ్యలతో పాటు వారి కుటుంబసభ్యులు కారంపొడి, గొడ్డళ్లతో, కర్రలతో వచ్చి మహిళలు బాబు కుటుంబ సభ్యులపై కారంపొడి చల్లగా గొడ్డళ్లతో దాడి చేశారు. వారి ఇంటి వద్ద ఉన్న కారు, ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. బాబు తండ్రి కనకయ్యకు తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు ప్రాణభయంతో పరుగులు తీశారు. స్నేహితుల సహాయంతో సిరిసిల్ల హాస్పిటల్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ఆంజనేయులు హాస్పిటల్ వెళ్లి బాధితులను పరిశీలించి వివరాలను సేకరించారు. అనంతరం ధర్మారం గ్రామంలో జరిగిన ఘటన స్థలాన్ని పరిశీలించారు. కుతాడి బాబు ఫిర్యాదు మేరకు లోకిని సతీష్, ప్రశాంత్, దేవయ్యలతో పాటు వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : భార్యా భర్తలకు గాయాలు

● పోలీసులు పట్టుకుంటారనే భయంతో ట్రాక్టర్‌ను వేగంగా నడిపిన డ్రైవర్

రామడుగు, ఏప్రిల్ 22: పోలీసులు వెంటపడుతుండగా ట్రాక్టర్‌ను వేగంగా నడిపిన డ్రైవర్ అది అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు అతని భార్యకు తీవ్రగాయాలయ్యాయి. రామడుగు మండలంలోని గుండి గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రామడుగు మండల కేంద్రానికి చెందిన బత్తిని రవి, కవితలు వడ్డెర కులస్థులు. బతుకుదెరువు కోసం ట్రాక్టర్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున రామడుగు వాగు నుంచి ఇసుకను భార్యా భర్తలు ఇద్దరు ట్రాక్టర్ లోడు చేసుకొని గోపాల్‌రావుపేట్‌లో నిర్మాణం జరుగుతున్న స్థలానికి తరలిస్తున్నారు. గోపాల్‌రావుపేట్ బస్టాండ్ సమీపానికి చేరుకునేసరికి తెల్లవారు జామున జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులు ఇన్నోవా వాహనంలో ఓ కానిస్టేబుల్ డ్రైవర్‌తో పాటు గస్తీ నిర్వహిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకునేందుకు పోలీసులు వెంటపడగా ట్రాక్టర్‌లో ఉన్న డ్రైవర్ రవి, తన భార్య కవితలు భయంతో ట్రాక్టర్‌ను వెనుకకు మలుపుకొని వేగంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో గుండి గ్రామపంచాయతీ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి ఇసుకలోడుతో సహ పిల్ల కాల్వలోకి దూసుకెళ్లి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటనలో భార్యా భర్తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.



గుండిలో బోల్తాపడ్డ ట్రాక్టర్

కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

● నూతన వధూవరులతో సహా ఐదుగురికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 22 : కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలోని గట్టుదుద్దెనపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులోకి కారు దూసుకెళ్లిన సంఘటనలో నూతన వధూవరులతో సహా ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. హన్మకొండకు చెందిన దామెర తిలక్ (36), స్వాతిల వివాహం ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగింది. సోమవారం నూతన వధూవరులు, వరుడి తల్లిదండ్రులు దామెర సురేందర్ (65), దామెర కౌసల్య (55)తో పాటు పెళ్లి కూతురు చెల్లెలు విద్య(20)లు కలిసి ఒకే కారులో ఐదుగురు హన్మకొండకు బయలు దేరారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిపై పనులు నడుస్తుండగా నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులోకి కారు దూసుకపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్రగాయాలు కాగా కారు నుజ్జునుజ్జు అయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజుకుమార్ తెలిపారు.



కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

నర్సరీలో అగ్ని ప్రమాదం

తిమ్మాపూర్, ఏప్రిల్22: తిమ్మాపూర్ మండల కేంద్రంలో రాజీవ్ రహదారికి సమీపంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వెనుకాల గల తెలంగాణ వెజిటెబుల్ నర్సరీలో సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. గమనించిన నర్సరీ యాజమని, అందులో పనిచేసే వారు అక్కడికి చేరుకుని మంటలను నివారించేందుకు చాలాసేపు శ్రమపడ్డారు. ఎగిసిపడుతున్న మంటలపై నీటిని చల్లారు. ఈ విషయంపై నర్సరీ యాజమని ఆశా కిరణ్‌ను అడుగగా ట్రేలు ఒకే చోట ఉండటం వల్ల ఎండ వేడిమికి మంటలు అంటుకొని ఉండవచ్చన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు 3వేలకు పైగా ప్లాస్టిక్ ట్రేలు, డ్రిప్ సిస్టం పైపులు, గ్రీన్ షెడ్ నెట్ కలిసి సుమారు 4లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, అధికారులు స్పందించి ఆదుకోవాలని సంఘటన స్థలానికి వచ్చిన తహసీల్దార్ కనకయ్యకు నర్సరీ నిర్వాహకులు విన్నవించారు.



నర్సరీలో మంటలను ఆర్పుతున్న స్థానికులు

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ

● ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 22 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో మోటార్ సైకిల్‌ను సోమవారం లారీ ఢీకొన్న ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన తాల్లపల్లి సంపత్ అనే వ్యక్తి తన మోటార్‌సైకిల్‌పై గట్టుదుద్దెనపల్లి పెట్రోల్ బంక్‌కు వెళ్లి తిరిగి వన్నారం గ్రామానికి వెళ్తున్నాడు. ఓ లారీ కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తుండగా మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంపత్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎక్కడి ధాన్యం..అక్కడే

● నత్తనడకన కొనుగోళ్లు..కొన్ని చోట్ల ఇంకా మొదలవ్వని తూకం ● పట్టించుకోని అధికారులు ● ఆందోళనలో రైతాంగం


శ్రీరాముల పల్లె కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన వరి ధాన్యం

గొల్లపల్లి, ఏప్రిల్ 22 : గొల్లపల్లి మండలంలో యాసంగి వరి ధాన్యం రాశులు ప్రభుత్వరంగ కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయానికి పోసిన వరి ధాన్యం నిల్వలు ఎక్కడి ధాన్యం అక్కడే పేరుకుపోయాయి. పది హేను రోజులుగా మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. వరి పంట రైతుల చేతికంది వస్తుండడంతో మండలంలో వరి కోతలు ఊపందుకున్నాయి. ఇప్పటికే యాభై శాతం మేర వరి ధాన్యంను కల్లాల నుంచి నేరుగా విక్రయం నిమిత్తం ప్రభుత్వ రంగ కొనుగోలు కేంద్రాలకు తరలించి కొనుగోళ్ల కోసం ఎదిరిచూస్తున్నారు. అయితే, పలు గ్రామాల్లోని కేంద్రాల్లో మ్యాచర్ పేరిట కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండగా, మరి కొన్ని కేంద్రాల్లో ఇప్పటికి వరి ధాన్యం తూకానికి నోచుకోక కేంద్రాల్లో మూలుగుతున్నాయి. అయితే, ఆరుగాళం కష్టించి పండించిన వరి ధాన్యం విక్రయం నిమిత్తం కొనగోలు కేంద్రాల్లో పోసి రోజుల తరబడి కేంద్రాల్లో పడిగాపులు పడాల్సి వస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు.

మండలంలో గొల్లపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో 14 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఐకేపీ ఆధ్వర్యంలో 4 కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లను నిర్వహిస్తున్నారు. దీంతోపాటు చెందోళి సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఐదు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లను నిర్వహిస్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో మండలంలోని 27 గ్రామాల్లో 22వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి వరి పంటను సాగు చేశారు. ఇప్పటికే యాభై శాతం మేర వరి కోతలు పూర్తవగా, మరో యాభై శాతం పంట కోతలకు సిద్దంగా ఉన్నాయి. అయితే, కేంద్రాల్లో విక్రయానికి పోసిన వరి ధాన్యం నిల్వలు ఎక్కడికక్కడే పేరుకుపోయినప్పటికి సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని గుంజపడుగు, గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం నిల్వలు పేరుకుపోయి స్థలాల కొరతతో రోడ్ల పై పేరుకుపోయి వాహనదారులకు ప్రమాదభరితంగా మారాయని ఆయా గ్రామాల వాహనచోదకులు వాపోతున్నారు. కొనుగోళ్లలో మందకొడి తనం, అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతులకు శాపంగా మారింది. కొనుగోళ్ల కోసం రైతులు కేంద్రాల చుట్టూ రాత్రనక, పగలనక ప్రదక్షిణలు చేస్తూ కొనుగోళ్ల కోసం ఎదిరిచూస్తున్నారు. ఇప్పటివరకు గొల్లపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో సుమారు 4 వేలు, ఐకేపీ ఆధ్వర్యంలో సుమారు 6 వందల క్వింటాళ్ల వరకు వరి ధాన్యంను రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు ఆయా శాఖల అధికారులు పేర్కొన్నారు.

కేంద్రాల్లో రైతులకు కనీస వసతులు కరువే

మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వరంగ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎండలకు రైతులు సేద దీరడానికి కేంద్రాల్లో ఏలాంటి ఏర్పాట్లు చేయడం లేదని రైతుల వాపోతున్నారు. ఆయా కేంద్రాల వద్ద చెట్లను కింద సేద దీరాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. యాసంగి సీజనల్‌లో మ్యాచర్ పేరిట కొనుగోళ్లలో జాప్యం చేయడాన్ని రైతులు తీవ్రంగా నిరసిస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ఉపద్రవం వచ్చి ఆరుగాళం చెమటోడ్చి పండించిన పంటను నేల పాలు చేస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతుల నుంచి కొనుగోళ్లు చేస్తున్న మిల్లర్లు :

ప్రభుత్వరంగ సంస్థల వరి ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యాన్ని కొందరు రైసు మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. సందట్లో సడేమియాలాగా రైసుమిల్లర్లు రైతుల నుంచి నేరుగా తక్కువ ధరలకు వరి ధాన్యంను కొనుగోలు చేస్తూ నిలువుదోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ గిట్టుబాటు ధర కన్న ఐదారు వందలు తక్కువ చెల్లించడమే కాకుండా తప్పతాళు పేరిట కొంత, క్యాష్ కటింగ్ పేరిట కొంత అందినకాడికి దండుకుంటూ రైతుల శ్రమను నిలువుదోపిడీ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వరంగ కేంద్రాల్లో రోజుల తరబడి ఎదిరిచూడడం వల్ల అకాల వర్షం పడితే వచ్చే నష్టం ముందు ఇదే నయం అని రైతులు రైసుమిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇదే అదనుగా భావించిన మిల్లర్లు రైతుల నుంచి అందినకాడికి దండుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, మిల్లర్ల ఇష్టారాజ్యం రైతులకు శాపంగా మారింది. సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి రైసుమిల్లర్ల నిలువు దోపిడీని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

వినోద్‌కుమార్‌కు మద్దతుగా నిలవాలి


వినోద్‌కుమార్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతున్న నాయకులు

కొడిమ్యాల, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతు ఇవ్వాలని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంటకటేష్‌గౌడ్ కోరారు. సోమవారం మండలంలోని పూడూర్, గౌరాపూర్, నర్సింహులపల్లి, నమిలికొండ గ్రామాల్లో గ్రామాల్లో ముఖ్య నాయకులను, ప్రజలను కలిసి తెలంగాణ అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించే వినోద్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేసిన విషయాన్ని ప్రజల వద్దకు తీసుకవెళ్లాలని బీఆర్‌ఎస్, నాయకులను, కార్యకర్తలను కోరారు. ఆయన వెంట మండల బీఆర్‌ఎస్ నాయకులు బొడ్డు రమేష్, వొల్లాల లింగాగౌడ్, కొత్తూరి స్వామి, బైరి వెంకటి, కాయిత రాజు, అబ్రహం, రాజ్‌పాల్, అనిల్, అజయ్, మహేష్, నరేష్, తదితరులు ఉన్నారు.

కన్నుల పండువగా రాములోరి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి, ఏప్రిల్ 22 : మండలంలోని నంచర్ల రామాలయంలో సోమవారం రాములోరి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 17 నుంచి జరుగుతున్న ఉత్సవాలలో సోమవారం అర్చకుల వేదమంత్రాల మధ్యన భక్తులు రథహోమం, బలిప్రదానం నిర్వహించి అంగరంగ వైభవంగా రథోత్సవము నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులందరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ ఛైర్మన్ బండి వెంకన్న, ఎంపీపీ గోళి శోభాసురేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శతచండీ మహాయాగం పూజలు ప్రారంభం

ధర్మపురి, ఏప్రిల్ 22: ధర్మపురి పట్టణంలోని ప్రకృతి టౌన్ షిప్‌లో శతచండీ మహాయాగ పూజలు సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. శతచండీ మహాయాగం బ్రహ్మశ్రీ కాసర్ల వంశీకృష్ణ ఆచార్యత్వంలో ఉదయం గణేష్‌పూజ, పుణ్యాహవచనం, దీక్షావరణము, యాగశాల ప్రవేశం, చండీ పారాయణం, వాస్తు నవగ్రహ, యోగిని, క్షేత్రపాలక, సర్వతోభద్ర మండల స్థాపన పూజలు, ప్రధాన కలశ స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. చండీ పారాయణం, గణపతి హోమం, విశేషపూజ, మంగళహారతి, మంత్రపుష్పం, చతుర్వేద సేవ, తీర్థ ప్రసాద వితరణ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి నరసింహ ప్రాజెక్ట్ నిర్వాహకులు ఒజ్జల ప్రవీణ్‌శాస్త్రి-స్వాతి పాల్గొన్నారు.

కంటి చూపుపై శ్రద్ధ వహించాలి

గొల్లపల్లి, ఏప్రిల్ 22 : విద్యార్థి దశ నుంచే కంటి చూపుపై శ్రద్ధ వహించాలని ప్రోగ్రామ్ అధికారి డా. శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. సోమవారం గొల్లపల్లి మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షల వైద్య శిబిరం నిర్వహించగా ఆయన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా 124 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించి నలుగురికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కంటి చూపు లోపాలకు కారణాలు, నివారణ చర్యల గూర్చి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వరంగ విద్యాసంస్థల్లో విద్యార్థులకు కంటి పరీక్షల వైద్యా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. నరేష్, ఆప్తాల్మిక్ అధికారి తిరుపతి, సిహెచ్‌వో గట్టు శ్రీధర్, సూపర్‌వైజర్ నరేందర్, ఏఎన్‌ఎమ్ నిర్మల, ప్రత్యేకాధికారి పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్

గొల్లపల్లి, ఏప్రిల్ 22 : ఇస్రాజ్ పల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ మండల ప్రధాన కార్యదర్శి సంకటి చంద్రశేఖర్ యాదవ్ అంత్యక్రియల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. శేఖర్ మృతి పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటని, ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు చిర్ర గంగా ధర్, కొండ వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

మేడిపల్లి కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 22: మండలంలోని మేడిపల్లి గ్రామంలోని భూవివాదంలో వ్యవహరిస్తున్న తీరు పట్ల పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన అడెపు సౌమ్య కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ఇంటి నంబర్లు 4-121, 4-122ల ఇళ్ల స్థలాలను 2022లో కొనుగోలు చేశామన్నారు. స్థలంలో షటర్ నిర్మాణం కోసం టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్నామన్నారు. గ్రామంలోని మున్నూర్ కాపు సంఘానికి స్థలంపై ఎలాంటి హక్కులు లేకున్నా అభ్యంతరం తెలపడంతో పంచాయతీ కార్యదర్శి సంఘం సభ్యులకు మద్దతుగా షటర్ నిర్మాణానికి నిరాకరిస్తున్నారన్నారు. దీంతో మెట్‌పల్లి కోర్టు నుంచి మున్నూర్ కాపు సభ్యులపైన ఇంజంక్షన్ ఆర్డర్ సైతం తీసుకొచ్చి షటర్ నిర్మాణం కోసం గుంతలు తవ్వామన్నారు. సంఘ సభ్యులు తమ పైన కోర్టులో కేసు వేస్తావంటూ గుంతలను పూడ్చి ఇటుకలను ధ్వం సం చేశారని, దీంతో సంఘం సభ్యులపైన ఈనెల 13న ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. మున్నూర్ కాపు సభ్యులకు మద్దతుగా ఉండి తవ్విన గుంతలను పూడ్చి వేయాలని, దరఖాస్తును నిరాకరించడమే కాకుండా వారితో రాజీచేసుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడని పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

కోరుట్ల, ఏప్రిల్ 21 : పట్టణ శివారులోని వెంకటసాయినగర్‌లో సోమవారం కాలనీకి చెందిన విజయ లక్ష్మి అనే మహిళ మెడ నుంచి రెండు తులాల బంగారు అభరణం గుర్తు తెలియని వ్యక్తులు లాకపోయినట్లు పోలీసులు తెలిపారు. విజయలక్ష్మి రాత్రి సమయంలో కాలనీలో వాకింగ్ చేస్తూండం గా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి విజయలక్ష్మి మెడలోని బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నరసింహుని సన్నిధిలో హనుమాన్ భక్తుల రద్దీ

ధర్మపురి, ఏప్రిల్ 22: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో సోమవారం హనుమాన్ భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం సుదూర ప్రాంతాలకు చెందిన అనేక మంది హనుమాన్ దీక్షాపరులు, భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. రావిచెట్టు ఆంజనేయ స్వామి చుట్టు ప్రదక్షిణాలు చేశారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే క్రీడలపై దృష్టి సారించాలి


పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

మెట్‌పల్లి, ఏప్రిల్, 22 : విద్యార్థులు చిన్నతనం నుండి క్రీడలపై దృష్టి సారించి జాతీయ స్థాయికి ఎదగాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్యయ్యరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మిని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హాజరైన క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం పెరిగడంతో పాటు స్నేహభావం పెరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనడంతో చిన్నతనం నుండి గెలుపు ఓటములు సహజంగా తీసుకొని మరింత నైపుణ్యం పొందడానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. జరిగినన పోటీల్లో జిల్లా నుంచి సుమార్ 150మంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడకారులను ఈనెల 28న సూర్యపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గజేల్లి రాందాస్, శ్రీలత, భవాని, మరుపల్లి కార్తీక్, గంగాధర్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించి లక్ష్యాన్ని చేరుకోవాలి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 22 : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించి జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు త్రినాథ్ సూచించారు. మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు గురుకులంలో సీట్లు సాధించిన వారిని సన్మానించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవైట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు కోచింగ్ ఇవ్వడంతో ఏడుగురు విద్యార్థులు సీట్లు సాధించారన్నారు. ఉపాధ్యాయులు భావన, రాజశేఖర్, నాగరాజు, విష్ణు, లక్ష్మి, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మెట్‌పల్లి, ఏప్రిల్, 22 : ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి ఒక్కరు అవగాహన కల్పించాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ సూచించారు. ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఓటు హక్కు వినియోగంలో భాగంగా ఆర్పీలు, మహిళ సంఘాలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మెహింది కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మెప్మా ఏవో శ్రీనివాస్‌డౌడ్, ఇన్‌చార్జి శానిటరి ఇన్స్‌పెక్టర్ రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగలను అవమానించిన కాంగ్రెస్

వెల్గటూర్, ఏప్రిల్ 22: ఎస్సీ రిజర్వేషన్ ఉన్న స్థానాలలో మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించక రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల ను అవమానించిందని రాష్ట్ర దళిత సంఘాల సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ముల్కాల గంగరాం మండిపడ్డారు. సోమవారం కిషన్‌రావుపేటలో నిర్వహించిన దళిత సంఘాల అత్యవసర సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగలను విస్మరించి అవమానించిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే ఎంపీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో తక్కువ స్థాయిలో మాల కుటుంబాలు ఉన్నప్పటికీ మొదటి నుంచి కేవలం వెంకటస్వామి కుటుంబీకులకే ఎంపీ సీటు కేటాయిస్తూ ప్రతీ సారి మాది గలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. మాదిగ జాతి ఆత్మ గౌరవా నికి, కాంగ్రెస్, బీజేపీల మధ్య జరుగుతున్న యుద్ధంలో అంతిమ విజయం మాదిగలదే అన్నారు. మాదిగల పట్ల సానుకూల వైఖరి ఉన్న కొప్పుల ఈశ్వర్ ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో దళిత సంఘాల నాయకులు కవ్వంపల్లి హనుమాండ్లు, శ్రీకాంత్, మెరుగు ప్రకాష్, కుమార్, నగేష్, కిరణ్, రాజు, రాము, ఎల్లయ్య, బాబు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం


మెట్‌పల్లిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

మెట్‌పల్లి, ఏప్రిల్, 22 : నిజామాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ ధర్మపురి అర్వింద్ గెలుపు కోసం బూత్ అధ్యక్షుడు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధోనికెల నవీన్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. సోమవారం పట్టణంలోని 14వ వార్డుల్లో ఇంటింటికి కర పత్రాలను అంజేసి బీజేపీ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో ఒక్క అవినీతి ఆరో పణ లేకుండా నీతి నిజాయితీ నిబద్ధతతో కూడిన రాజకీయాన్ని పరిచయం చేసిన ఎంపీ అర్వింద్ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడంలో ముందున్న ఎంపీ ట్రస్టు ద్వారా వందలాది మంది పసిపిల్లలను బతికించిన ప్రాణదాత అయిన అర్వింద్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజే పీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్, కౌన్సిలర్ మర్రి పోచయ్య, విజయ్, అంజయ్య, మేనయ్య, కురుమ రమణాచారి పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు సేవలు అందించాలి


బ్యాంకు సిబ్బందితో చైర్మన్ శోభ

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 22 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు బ్యాంకు సేవలు అందించడానికి నూతన బ్రాంచ్ ఏర్పాటు చేయడం జరిగిందని బ్యాంక్ చైర్మన్ శోభ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో 434వ బ్రాంచ్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వారి నగదు లావదేవిలు జరపడానికి పట్టణాలకు వెల్లడానికి ఇబ్బందులు పడకుండా నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు బ్యాంక్‌లో జీరో అకౌంట్ సౌకర్యం ఇస్తామన్నారు. బ్యాంక్‌లో ఖాతాలు తీసుకొని నగదు డిపాజిటులు, అవసరాల నిమిత్తం లోన్‌లు తీసుకొని సకాలంలో చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ నరేష్, మెట్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ నాంపల్లి పవన్‌కుమార్, క్యాషియర్ ప్రణయ్, సిబ్బంది, నాయకులు, ఖాతాదారులు, పాల్గొన్నారు.

కథలాపూర్‌లో భారీ వర్షం

కథలాపూర్, ఏప్రిల్ 22 : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట సేపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో రైతన్న తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కోతలు పూర్తి చేసిన రైతులు తమ వరి ధాన్యంను కేంద్రాల్లో ఆరబెట్టారు. అయితే ఒక్కసారిగా వర్షం రావడంతో ధాన్యం తడిచి ముద్దయింది. గత మూడు రోజుల కింద కురిసిన వర్షం వల్లె ధాన్యం మొలకలెత్తగా మరో మారు రైతులకు కష్టాలు తప్పడం లేదు. అదేవిధంగా తూకం వేసిన ధాన్యంను రైస్ మిల్లులకు తరలించేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని నిర్వాహకులు వాపోతున్నారు.

ఘనంగా హనుమాన్ విజయయాత్ర


మెట్‌పల్లిలో హనుమాన్ విజయయాత్రలో పాల్గొన్న దీక్షపరులు

మెట్‌పల్లి, ఏప్రిల్, 22 : పట్టణంలో శ్రీ వీర హనుమాన్ విజయయాత్రను విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు ఘనంగా జరిపారు. సోమవారం పట్టణం అనుబంధ గ్రామమైన ఆరపేట శివాలయం నుండి సాయంత్రం యాత్రను నిర్వహించారు.

జాతీయ రహదారి గుండా మహాలక్ష్మి దేవాలయం, బస్ డీపో, వ్యవసాయ మార్కెట్ యార్డు, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, పోలీసు స్టేషన్ మీదుగా అయ్యప్ప స్వామి ఆలయం వరకు శ్రీ వీర హనుమాన్ వి జయ యాత్రను నిర్వహించారు. యాత్రలో హిందూవులు, హనుమాన్ దీక్షపరులు, యువకులు పాల్గొని జై శ్రీరామ్, జై హనుమాన్ నామసరణంతో జాతీయ రహ దారి గుండా భజన చేసుకుంటూ ర్యాలీగా అయ్యప్ప ఆలయంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ధర్మం, దేవాలయ రక్షణ, సనాతన సంస్కృతి, గోమాత సంరక్షణ కోసం విజయయాత్రను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు, హిందూవులు, హనుమాన్ దీక్షపరులు, యువకులు, భక్తులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు ముడుపు కట్టిన నిజామాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి

మల్యాల, ఏప్రిల్ 22: నిజామాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం కొండగట్టు ఆంజనేయస్వామికి ముడుపుకట్టారు. ఎంపీగా గెలుపొందాలని కోరుకుంటూ అంజన్నకు పూజలు నిర్వహించిన అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్‌తో కలిసి ముడుపు కట్టారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జి.రాజేశంగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా తిరుపతి

వెల్గటూర్, ఏప్రిల్ 22: మండలంలోని శాఖాపూర్ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బోడకుంటి శ్రీనివాస్, చైర్మన్‌గా పంజాల తిరుపతి ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తనుగుల చంద్రమౌళి, ఉపాధ్యక్షుడిగా మోటపల్కుల తిరుపతి, కొత్త హరీష్ ఎంపిక కాగా కోశాధికారిగా రంగం మధు ఎంపికయ్యారు. ప్రచార కార్యదర్శిగా మిరాల రమేష్, కార్యదర్శిగా నాగపురి రవి గౌడ్, గౌరవ సలహా దారులుగా బాలసాని రవిగౌడ్, మంచాల గోపాల్ స్వామి, సంగెం అశోక్, వేముల ప్రవీణ్, గర్వందుల శ్రీనివాస్ ఎంపికయ్యారు.

కొనుగోళ్లు వేగవంతానికి చర్యలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 22 : కొనుగోళ్లు వేగవంతం చేయడానికి చర్యలు చేపట్టామని జగిత్యాల మండల ఐకేపీ ఏపీఎం ఓదెల గంగాధర్ అన్నారు. సోమవారం జగిత్యాల మండలంలోని మోతె, ధరూర్, రూరల్ మండలంలోని వెల్దుర్తి తిమ్మాపూర్, అంతర్గాం, గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏపీఎం గంగాధర్, సివిల్ సప్లై అధికారి వరప్రసాద్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు శ్రీనివాస్, రమ్య, నాగరాజు, హరీష్, సీసీలు మరియా, గంగారాం, సాగర్ పాల్గొన్నారు.

గురుకుల సీటు పొందిన విద్యార్థిని

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 22 : జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన తూము నైతిక ఇటీవలే వెలవడిన గురుకుల ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబరిచి లక్ష్మీపూర్ గురకుల పాఠశాలలో సీటు సాధించింది. నైతికను ఉపాధ్యాయులు, అభినందించారు.

యువత తోటి వారికి ఉపాధి కల్పించాలి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 22 : యువత ఎవరిపైన ఆధారపడకుండా స్వంతంగా ఉపాధి పొందడమే కాకుండా తోటి వారికి ఉపాధి కల్పించే దిశగా ఎదగాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని కోనరావుపేట గ్రామానికి చెందిన మ్యాడ పు రాజేందర్‌రెడ్డి నూతనంగా రక్ష ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయగా ఆయన ముఖ్య అతిథిగా హాజరైన చిన్నారులతో కలిసి ప్రారంభించారు. నేటి ఆధునిక సమాజంతో పోటీ పడుతూ ప్రతిదానిలో ముందుండాలన్నారు. యువత ఉపాధి పొందడమే కాకుండా ఇతరులకు ఉపాధి కల్పించే విధంగా పనులు చేపట్టాలన్నారు. అదే దిశగా కోరుట్ల పట్టణంలో వెబ్ హాబ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వేల సంఖ్యలోని నిరుద్యోగులకు అవకాశాలను అందించామన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, నల్ల తిరుపతిరెడ్డి, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ భక్తులకు పండ్లు, మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

జగిత్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి): చిన్న హనుమాన్ జయంతి పురస్కరించుకొని కొండగట్టుకు వెళ్తున్న హనుమాన్ దీక్షా భక్తులకు సోమవారం పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు ఉచితంగా మంచినీరు, మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని గోవిందుపల్లి ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ రోడ్డులో గల సాయినాథ్ ఐరన్ మర్చంట్ వద్ద ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. హనుమాన్ భక్తులకు వాటర్ ప్యాకెట్స్, వాటర్ బాటిల్స్, బట్టర్ మిల్క్ ప్యాకెట్స్, వివిధ రకాల పండ్లను అందించారు. పలువురు జగిత్యాల-గోవిందుపల్లి ఆర్యవైశ్య సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొండగట్టుకు కాలినడకన పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు ఉచితంగా తాగునీరు, పండ్లు, మజ్జిగను జగిత్యాల పట్టణానికి చెందిన జయశ్రీ ఫ్లెక్సీ ప్రింటర్స్ అధినేత మునిపట్ల దేవేందర్ అతని సతీమణి భాగ్యలక్ష్మీ, కూతురు కౌముది పంపిణీ చేశారు.